# నాగరీక ప్రపంచం నివ్వెరపోయింది!

"రాతి యుగాన్ని దాటి, వాటి కష్టాలను నిర్మూలించి ఎంతో నాగరికులమై పోయామని, విద్యా వైద్య అనేక వృత్తులలో ఎంతో అభివృద్ధి సాధించామని చంకలు కొట్టుకుంటున్నాం! అంతా నాన్‌సెన్స్" అరిచింది విద్యారాణి. ఉలిక్కిపడింది పక్కనున్న శ్రీలక్ష్మి. "ఏం జరిగింది?" అడిగింది.

"ఇంకా ఏం జరగాలి? మూడడుగులు ముందుకేస్తే ఆరడుగులు వెనక్కేస్తావ్?" అంటూ ఏదో పాత సినిమాలో ఒక జోకరు మొండి గుర్రాన్ని పట్టుకుని పాట పాడ్తాడు! అలాగ మన నాగరికత మూడడుగులు ముందు కెళితే ఆరడుగులు వెనక్కొస్తోంది" అంది భరించలేని కోపంతో పళ్లు కొరుకుతూ.

విద్యారాణి కోపానికి అర్థం తెలీక నివ్వెరపోయి చూసింది శ్రీలక్ష్మి.

"చూడు ఈ పేపర్ చూడు. నిన్నటిదాకా వరకట్నపు చావులు. ఇవాళ మరో మలుపు. పదహారేళ్ల పసిడితల్లి పతిభక్తితో విరహాన్నీ వియోగాన్నీ భరించలేక కన్నవారినీ, ఉన్నవారినీ విడిచి నిప్పుల్లోకి దూకి నిలువునా నిండు ప్రాణాలని తీసుకుందట! ఆమెని దేవతగా భావించి, అక్కడ గుడికట్టి పూజా పునస్కారాలు చెయ్యడానికి, జనం కడుపు మాడ్చుకునైనా విరాళా లిస్తున్నారట. ఆమె ఫోటోలు ఎంత ఖరీదైనా సరే కొనుక్కు వెళ్తున్నారట. ఉన్నవారు వేలల్లో విరాళాలిచ్చి గుడి నిర్మాణానికి, దాతల లిస్టులో పేరు నమోదు చేసుకుంటున్నారు. అంటే మనం మళ్లీ సతీ సహగమన కాలం దగ్గరకు చేరుకున్నామన్నమాట. వైకుంఠపాళీ ఆటలో ఒక నిచ్చెనెక్కితే రెండు పాముల నోట్లో పడి మళ్లీ తోక చివరకు మొదటికొస్తా మన్నమాట. అలాగుంది మన వ్యవహారం. రాజా రామ్‌మోహనరాయ్, బాలగంగాధర తిలక్, వీరేశలింగం పంతులుగారి వంటి ఎందరో నేతలు, సంఘ సంస్కర్తలు చేసిన త్యాగాల, కృషి ఫలితంగా ఈనాడు భారత నారి, వంటింటి పరిధిని దాటి బయటి వెలుగును చూస్తోంది. అవిద్యనుంచి

విముక్తిపొంది, విద్యకీ, ఉద్యోగానికీ నోచుకుని అన్ని రంగాలలోనూ అవకాశమిస్తే ఆడది మగాడికి తీసిపోదని నిరూపిస్తోంది! అయినా ఆమె బాధలనుంచి పూర్తిగా విముక్తి పొందలేదు" చెప్పడం ఆపి విద్యారాణి మంచినీళ్లు తాగింది.

"కరెక్ట్ మేడం మీరు చెప్పింది. మనిషి మనిషిని చంపగలుగుతున్నాడు, ప్రాణాలు తీయగలుగుతున్నాడు కానీ, ప్రాణంపోయిన మనిషికి ప్రాణాలు పోయలేకపోతున్నాడుకదా!

ఆ విషయంలో దేవుడిమీదే భారం వేస్తున్నాడు. ప్రాణం పోయలేనివాడు ప్రాణం తీయడానికి అర్హుడా?" శ్రీ లక్ష్మి కూడా ఈ సారి ఆవేశంతో ఊగిపోతూ అడిగింది.

"కరెక్ట్! మంచి ప్రశ్నవేశావ్? ఆడవాళ్లు ఏకమై ఈ దారుణాన్ని ఆపాలి? ఈ మారణహోమాన్ని మాపాలి! భర్తని ప్రాణ త్యాగానికి పూనుకున్నా, ఆమెని ఆపి ఆదుకోవాలి, ఆమె దుఃఖాన్ని దూరం చెయ్యాలి! ఆమె బ్రతకడానికి కావలసిన ధైర్యాన్ని అందజెయ్యాలి, అంతేకానీ, మూఢ నమ్మకాలతో, అవివేకంగా ఆత్మాహుతి చేసుకోనివ్వకూడదు. పూజల పేరిటా, పునస్కారాల పేరిటా, పశుబలిని ఆపు చేశాం! నరబలిని కూడా చాలా మట్టుకు రూపుమాపాం! సహగమనాలను అరికట్టాం నిజానికి! కాని మళ్ళీ తలెత్తిన ఈ సహగమన చర్య నాగరికతకే గొడ్డలిపెట్టు! సంస్కృతికే అవమానం! ఆడ జాతికే అవమానకరం! కన్నెపిల్లలు పెళ్లంటే హడలిపోయే దుస్థితి రాకూడదు, ఆడపిల్లని కన్నవారు కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితి కలగకూడదు. అందుకు మనం నడుం బిగించాలి! ఈ ఘోరాన్ని ఆపాలి! అప్పుడే సిసలైన నాగరికతని సాధించినట్టు" ఉద్రేకంతో చెప్పుకుపోతోంది విద్యారాణి! "మేడం! మేమందరం మీతో ఏకీభవిస్తాం! ఈ దుర్మార్గాలని ఆపడానికి యధాశక్తి మేమూ ప్రయత్నిస్తాం" అన్నారు. కొంచెం దూరంలో తలుపుదగ్గర నిలబడి ఇదంతా వింటున్న కొందరు విద్యార్థులు కూడా వారి మాటలతో మాట కలిపారు!

విద్యారాణి తృప్తిగా నిట్టూర్చి చిరునవ్వుతో అందరివంకా ఒకసారి చూసి, పనిలో నిమగ్నురాలై పోయింది తేలిక పడ్డ హృదయంతో! ★